## క్లుప్తంగా

### సభ జయప్రదం కావాలని పాదయాత్ర


ఆలయానికి పాదయాత్రగా వెళ్తున్న రవికిరణ్

న్యాల్‌కల్(జహీరాబాద్): 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ విజయవంతం కావాలని బుధవారం బీఆర్‌ఎస్ నాయకుడు నామ రవికిరణ్ పాదయాత్ర నిర్వహించారు. ఉదయం జహీరాబాద్ నుంచి బయలుదేరి న్యాల్‌కల్ మండలంలోని రేజింతల్ గ్రామ శివారులోని సిద్ధివినాయక ఆలయానికి చేరుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు ఎలాంటి ఆటంకాలు లేకుండా జరగాలని స్వామివారికి మొక్కుకున్నట్లు తెలిపారు. మండల బీఆర్‌ఎస్ నాయకులు రవీందర్, ప్రవీణ్‌కుమార్, రాజ్‌కుమార్, సంగమేశ్వర్ తదితరులు స్వాగతం పలికారు.

### ట్రాఫిక్ జామ్‌తో ఇక్కట్లు


రింగ్‌రోడ్డు టోల్‌గేట్ వద్ద ట్రాఫిక్ జామ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు రింగ్‌రోడ్డు టోల్‌గేట్ వద్ద బుధవారం ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రింగ్‌రోడ్డు నుంచి పటాన్‌చెరు వైపు వెళ్లేందుకు టోల్‌గేట్ వద్ద వాహనదారులు సర్వీస్ రోడ్డుపై వరకు క్యూ కట్టారు. దీంతో వెలిమెల వైపు నుంచి ర్యాంప్ రోడ్డు మీదగా కొల్లూర్ వైపు వచ్చే వాహనాదారులు సైతం ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు పడ్డారు. అక్కడ ట్రాఫిక్ నియంత్రించేందుకు టోల్ సిబ్బంది కూడా లేకపోవడం విశేషం. నిత్యం ట్రాఫిక్ జామ్‌తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కారించాలని స్థానికులు కోరుతున్నారు.

### బీమా చెక్కు అందజేత


బీమా చెక్కు అందజేస్తున్న అధికారులు

నారాయణఖేడ్: ప్రమాదవశాత్తు నాగల్‌గిద్ద మండలం సక్రునాయక్ తండాకు చెందిన చౌహాన్ మారుతి మృతి చెందాడు. దీంతో వారి కుటుంబ సభ్యులకు తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ పింగళి సమత, ఖేడ్ శాఖ మేనేజర్ వినయ్ కుమార్ రూ.20లక్షల బీమా చెక్కును బుధవారం అందజేశారు. బ్యాంకులో పొదుపు ఖాతా ఉండగా ఎస్‌బీఐ జనరల్ ప్రమాద బీమా పాలసీని బాధితుడు పొందారు. దీంతో ప్రమాదశాత్తు మరణించడంతో నామినిగా ఉన్న అతని భార్య, కుటుంబ సభ్యులకు చెక్కు అందించారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

### పాడి పశువులతో ఆర్థికాభివృద్ధి
పశువైద్యాధికారి శైలేంద్ర జైస్వాల్


పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి

పటాన్‌చెరు టౌన్: రైతులు పాడి పశువులను ఆరోగ్యంగా కాపాడుకుంటే ఆర్థికాభివృద్ధి చెందవచ్చని మండల పశు వైద్యాధికారి శైలేంద్ర జైస్వాల్ అన్నారు. బుధవారం మండలంలోని పెద్ద కంజర్ల గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. గ్రామంలో 220 పశువులకు టీకాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉచితంగా అందించే గాలికుంటు టీకాలను రైతులు తప్పనిసరిగా పశువులకు వేయించాలని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది సర్దార్, శ్రావణ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయ వృత్తి గొప్పది


నారాయణ దంపతులను సన్మానిస్తున్న భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): సమాజాన్ని తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని బీబీపేటకు చెందిన స్కూల్ అసిస్టెంట్ కోడ్పగల్ నారాయణ పదవి విరమణ సభ బుధవారం పిట్లంలోని సాయిగార్డెన్స్‌లో నిర్వహించారు. నారాయణ దంపతులను పీఆర్‌టీయూ, వివిధ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో సన్మానం చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి , డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

# నిధులు మంజూరై మూడేళ్లు!

- ప్రారంభంకాని రోడ్ల నిర్మాణం పనులు
- మరమ్మతులకు నోచుకోని రోడ్లు


నిర్మాణానికి నోచుకోని జహీరాబాద్-తాండూరు రోడ్డు

జహీరాబాద్: నియోజకవర్గంలో పలు రోడ్లపై నడవలేని పరిస్థితి ఉంది. చాలా వరకు గుంతలమయంగా మారి ప్రయాణం చేయాలంటే వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలోని ఆయా రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరైనా నిర్మాణానికి నోచుకోలేక పోతున్నాయి. 2021–22, 2022–23 సంవత్సరంలో నాన్‌ప్లాన్, ఎండీఆర్ పథకాల కింద 12 పనులకు సంబంధించి రూ.28.15 కోట్ల నిధులు మంజూరయినా ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. రాంతీర్థ్, వడ్డీ నుంచి కర్ణాటక సరిహద్దు వరకు రోడ్డు నిర్మాణం కోసం 1.53 కోట్లు మంజూరయ్యాయి. మెటల్‌కుంట నుంచి అల్లాదుర్గం వరకు రూ.5.60 కోట్లు, జహీరాబాద్ నుంచి తాండూరు వెళ్లే రోడ్డుకు బోనస్‌పూర్ వరకు రోడ్డు నిర్మాణం కోసం రూ.4.36కోట్లు మంజూరయ్యాయి. జహీరాబాద్ నుంచి చించోలికి వెళ్లే రోడ్డు నిర్మాణానికి రూ.4.30 కోట్లు, కోహీర్ నుంచి బడంపేట మీదుగా గొటిగార్‌పల్లి వరకు రూ.95లక్షలు, జహీరాబాద్‌లోని ఎన్‌హెచ్.9 నుంచి కాశీంపూర్ మీదుగా అదస్‌గంజ్ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.1.93 కోట్లు మంజూరయ్యాయి. జహీరాబాద్ మండలం పస్తాపూర్ నుంచి కుప్పానగర్ వరకు రోడ్డు నిర్మాణం కోసం రూ.2.13 కోట్లు మంజూరయ్యాయి. గుడ్‌పల్లి నుంచి గోపన్‌పల్లి వరకు రూ.1.04 కోట్లు, చాల్కి–చీకుర్తి రహదారి కర్ణాటక సరిహద్దు వరకు నిర్మించేందుకు వీలుగా 1.58 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఎండీఆర్ ప్లాన్ కింద కోహీర్ నుంచి గొటిగార్‌పల్లి వరకు రహదారి నిర్మించేందుకు గాను రూ.2.90 కోట్లు మంజూరయ్యాయి. వీటిలో ఏ ఒక్క రోడ్డు కూడా పనుల ప్రారంభానికి నోచుకోలేకపోవడం విడ్డూరంగా ఉంది. ఇతర శాఖలకు సంబంధించిన పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు రాక పోవడంతో పనులు ప్రారంభించేందుకు కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదని అధికారులు చెబుతున్నారు. పనులను ప్రారంభించేందుకు సంబంధిత కాంట్రాక్టర్లపై వత్తిడి తీసుకువస్తున్నామంటున్నారు. 65వ జాతీయ రహదారి నుంచి మాడ్గి గ్రామం మీదుగా ధనాసిరి వరకు రోడ్డు నిర్మాణం కోసం 1.83 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ రహదారి పనులు మాత్రం ప్రారంభించినా నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటి వరకు కేవలం 30 శాతం మేత్రమే పనులు జరిగాయి. 65వ జాతీయ రహదారి నుంచి కోహీర్ వరకు 7 కిలోమీటర్ల మేర రహదారి దెబ్బతిన్నా నిర్మాణం కోసం అధికారులు ఇప్పటికీ ప్రభుత్వానికి ప్రతిపాదించకపోవడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జహీరాబాద్ పట్టణంలోని పస్తాపూర్ కమాన్ నుంచి పస్తాపూర్ గ్రామం వరకు రహదారి దెబ్బతిన్నా దీనిని మరమ్మతులు చేసే విషయంలో అధికారులు ఉదాసీన వైఖరిని అవలంబిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.

# సభను విజయవంతం చేయండి

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌రెడ్డి


నాయకులకు దిశానిర్దేశం చేస్తున్న ఎమ్మెల్యే

సంగారెడ్డి రూరల్: హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో 27న జరిగే రజతోత్సవ భారీ బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి గులాబీ శ్రేణులు వేలాదిగా తరలిరావాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పిలుపునిచ్చారు. సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ ముఖ్యనేతలతో బుధవారం ఎమ్మెల్యే సమావేశమయ్యారు. కేసీఆర్ సభ సమయం సందర్భాన్ని కార్యకర్తలకు ఎమ్మెల్యే వివరించారు. బహిరంగ సభకు ఒక రోజు ముందు ప్రతి వార్డులో జెండా ఆవిష్కరణ చేసుకోవాలన్నారు. కేసీఆర్ బహిరంగ సభతో దేశ రాజకీయాల్లో చర్చ జరుగుతుందన్నారు.

**గులాబీ దండు కదం తొక్కాలి**

సంగారెడ్డి రూరల్ : రజతోత్సవ భారీ బహిరంగ సభ వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ బుధవారం పట్టణంలోని గోడలకు అతికించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా నుంచి గులాబీ శ్రేణులు కదం తొక్కాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ బహిరంగ సభతో దేశ రాజకీయాల్లో చర్చ జరుగుతుందని, అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, చింత సాయినాథ్, పట్టణ కార్యదర్శి నర్సింలు, మండల అధ్యక్షుడు చక్రపాణి పాల్గొన్నారు.

### సీసీ పనులు ప్రారంభం


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

పుల్‌కల్(అందోల్): మండలంలోని కోడూరు గ్రామంలో బుధవారం సీసీ రోడ్డు పనులను పలువురు కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రవీందర్ మహేశ్, అంజయ్య, రవి పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్


అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జహీరాబాద్ టౌన్: అగ్నిమాపక శాఖ వారోత్సవాల(ఫైర్ సర్వీసెస్ వీక్)లో భాగంగా బుధవారం పట్టణంలోని సాయిరాంనగర్ కాలనీలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది ప్రమాదాల నివారణపై కాలనీ ప్రజలకు అవగాహన కల్పించారు. గ్యాస్‌లీక్ అయిన సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని చేసి చూపించారు. ప్రమాదాల్లో గాయపడిన వారికి ప్రథమ చికిత్స, , వంట గదిలో గ్యాస్ లీకేజీ కాకుండా చర్యలు, ఎలాంటి వాతావరణం కల్పించాలో వివరించారు. మంటలార్పడం గురించి కూడా ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. కార్యక్రమంలో జహీరాబాద్ అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జి శ్రీనివాస్, ఎఎల్ఎఫ్‌లు అశోక్, సలీమ్, పవన్, ఫైర్‌మెన్‌లు రామకృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

**◆ అప్రమత్తతతోనే నివారణ**

సంగారెడ్డి క్రైమ్: ఎండాకాలంలో పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉన్నందున కార్మికులు, పరిశ్రమ యాజమాన్యాలు అప్రమత్తంగా ఉండాలని పట్టణ ఫైర్‌సేఫ్టీ ఎస్సై కిరణ్ కుమార్ రెడ్డి సూచించారు. రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాలు భాగంగా కందిలోని అక్షయపాత్ర పరిశ్రమలో కార్మికులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. అటు పరిశ్రమ యాజమాన్యాలు, కార్మికులు తప్పనిసరిగా అగ్నిమాపక సాధనాలను ఎలా ఉపయోగించుకోవాలో తెలుసుకోవాలన్నారు. వాటిని అందుబాటులోఉంచుకోవాలన్నారు. రాత్రి సమయాల్లో విద్యుత్ అవసరం లేని సమయాల్లో మెయిన్ స్విచ్ ఆఫ్ చేసి ఉంచాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారులతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

**◆ జాగ్రత్తలు తప్పనిసరి**

సదాశివపేట(సంగారెడ్డి): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ప్రమాదాలు జరిగినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అగ్నిమాపక అధికారి భిక్షపతి ప్రజలకు వివరించారు. బుధవారం పట్టణ పరిధిలోని డబుల్‌బెడ్రూం కాలనీలోని అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. వంటగ్యాస్ లీకై సిలిండర్‌కు మంటలు అంటుకుంటే మంటలను ఆర్పే విధానాన్ని ప్రయోగాత్మకంగా చేసి చూపించారు.

# రైతుల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు: రైతుల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మండలంలోని లక్డారం, తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ముత్తంగి గ్రామం పీఏసీఎస్ పరిధిలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సన్నరకం వడ్లకు క్వింటాలకు రూ.500 బోనస్ అందిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నియోజకవర్గ పరిధిలోని కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేశామని వివరించారు. కార్యక్రమాల్లో రుద్రారం పీఏసీఎస్ అధ్యక్షుడు పాండు, ముత్తంగి పీఏసీఎస్ అధ్యక్షుడు భిక్షపతి, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, మేరాజ్ ఖాన్, అశోక్, కిట్టు, రామకృష్ణ, డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.


వట్‌పల్లి: కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వినోద్ గౌడ్

**కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి**

వట్‌పల్లి (అందోల్): రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని పీఏసీఎస్ చైర్మన్ వినోద్ గౌడ్ అన్నారు. బుధవారం ఖాదరాబాద్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోని విక్రయించి మద్దతు ధరను పొందాలన్నారు. మేలు రకం క్వింటాల్‌కు రూ.2320, సాధారణ రకం రూ.2300లకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ శ్రీకాంత్ పాల్గొన్నారు.

### రేపు జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

మునిపల్లి(అందోల్): ఈ నెల 18న మండలంలోని పెద్దచల్మెడ వ్యవసాయ సహకార పరపతి కేంద్రంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయికోడ్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తారని తెలిపారు. రైతుల సౌకర్యం కోసం జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు చెప్పారు.

**దళారులను నమ్మి మోసపోవద్దు**

జిన్నారం (పటాన్‌చెరు): రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని జిన్నారం మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ అన్నారు. బుధవారం జిన్నారం, ఊట్ల గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మాజీ ఎంపీపీ మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి సరైన మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గంగు రమేష్, ఐకేపీ ఏపీఎం నరేందర్, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, వడ్డే కృష్ణ, ఐకేపీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# తిరుగులేని శక్తిగా భారతి సిమెంట్

సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ శ్రీకాంత్


బీమా పత్రాలు పంపిణీ చేస్తున్న శ్రీకాంత్

వట్‌పల్లి(అందోల్): సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని శక్తిగా ఎదుగుతున్న వికాట్ గ్రూపుకి చెందిన భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను తెలంగాణలో విడుదల చేసింది. వికాట్ గ్రూప్ కంపెనీస్ ప్రపంచంలో 13 దేశాలలో విస్తరించి ఉన్నాయని సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ శ్రీకాంత్ తెలిపారు. వట్‌పల్లిలోని డీలర్ తిరుమల ఫర్టిలైజర్స్ ఆధ్వర్యంలో తాపీమేస్త్రీలకు బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతి సిమెంట్ మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందని, నిర్మాణం యొక్క దృఢత్వం చాలా అధికంగా ఉంటుందన్నారు. భారతి స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు ఈ సిమెంట్‌ను ఎంపిక చేసుకోవాలన్నారు. నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారన్నారు. అనంతరం మేస్త్రీలందరికీ లక్ష రూపాయల ప్రమాద బీమా పత్రాలు అందజేశారు.

# రేపు సిద్ధేశ్వర ఆలయంలో వార్షికోత్సవం

జహీరాబాద్ టౌన్: పట్టణ సమీపంలోని ప్రముఖ సిద్ధేశ్వర ఆలయంలో శుక్రవారం వార్షికోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ విభూతి శివ రుద్రప్ప ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రాంగణంలో మంగళగౌరి, నవగ్రహ, ఆంజనేయస్వామి, నగదేవత, హాటకేశ్వర, పంచలింగేశ్వర, కాళభైరవ, నందీశ్వర ఆలయాల నిర్మాణం చేపట్టి ఏడాది పూర్తవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా సిద్దేశ్వర స్వామికి సుప్రభాత సేవ, స్వస్తి పూణ్యాహవచనం, గణపతి పూజ, మహాప్రసాద వితరణ ఉంటుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.



# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సీఐ రవీందర్ రెడ్డి


అవగాహన కల్పిస్తున్న సీఐ రవీందర్ రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని బొల్లారం సీఐ రవీందర్ రెడ్డి అన్నారు. బుధవారం పోలీస్‌శాఖ నిర్వహించిన అవగాహనలో పాల్గొని మాట్లాడారు. బ్యాంకు లావాదేవీలు, మొబైల్ ఫోన్ల మెసేజ్‌లు, ఆన్‌లైన్ గేమ్‌లు , బెట్టింగ్ లోన్ యాప్‌లకు దూరంగా ఉంటే సైబర్ నేరాల నుంచి తప్పించుకోవచ్చు అన్నారు.

# అంగన్‌వాడీలో గ్రాడ్యుయేషన్ డే

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని బసవేశ్వర కమ్యూనిటీ హాల్‌లో బుధవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అంగన్‌వాడీలో చదువుతున్న పిల్లల చదువులు పూర్తయిన సందర్భంగా వారికి పట్టాలను ప్రదానం చేశారు. గ్రాడ్యుయేషన్‌డేకు పిల్లలు కొత్త దుస్తువులు ధరించి వచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీడీపీఓ అంజమ్మ మాట్లాడుతూ.. 3 సంవత్సరాలు నిండిన పిల్లల పేర్లను తప్పకుండా అంగన్‌వాడీలో నమోదు చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుతున్న సేవల గురించి వివరించారు.

**అంగన్‌వాడీ వార్షికోత్సవం**

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండల కేంద్రంలో బుధవారం అంగన్‌వాడీ కేంద్రాల వార్షికోత్సవం నిర్వహించారు. నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి వివిధ కార్యక్రమలు చేపట్టారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పార్వతి, సావిత్రి, పుష్పలత, మస్రత్‌బీ, తదితరులు పాల్గొన్నారు.


చిన్నారులకు గ్రేడింగ్ కార్డులు అందజేస్తున్న ప్రమీల

**అంగన్‌వాడీలో పోషణ్ పక్వాడ**

నారాయణఖేడ్: మహిళలు, గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ప్రమీల సూచించారు. మనూరు మండలం అతిమ్యాల్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణీలు రక్తహీనతకు గురికాకుండా చూసుకోవాలన్నారు. ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తల సలహాలు, సూచనలు పాటించాలని అన్నారు. ఐదేళ్లు నిండిన చిన్నారులకు ప్రోగ్రెస్, గ్రేడింగ్ కార్డులను అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం జీవన్ రాథోడ్, అంగన్‌వాడీ టీచర్లు పూలమ్మ, ప్రీతి, రియానాబేగం, గ్రామ పెద్దలు రాజు పాల్గొన్నారు.


కల్హేర్: వార్షికోత్సవంలో టీచర్లు, తదితరులు

## సంక్షిప్త వార్తలు

**◆ మందుబాబులకు జరిమానా**

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో 12 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 9 మందికి రూ.1500 చొప్పున, ఇద్దరికి రూ.2 వేలు చొప్పన, ఒకరికి రూ.వెయ్యి చొప్పన జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

**డ్రంకన్ అండ్ డ్రైవ్‌లో..**

సంగారెడ్డి క్రైమ్: డ్రంకన్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా న్యాయస్థానం జరిమానా విధించిన సంఘటన సంగారెడ్డి పట్టణ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్ వివరాల ప్రకారం.. మంగళవారం సంగారెడ్డి జాతీయ రహదారి, పాత బస్టాండ్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని బుధవారం కోర్టులో హాజరుపరచగా జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీస్‌లు పేర్కొన్నారు.

**◆ పేకాట స్థావరాలపై దాడి**

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం వాసర్ శివారులో జొన్నచేనులో పేకాట స్థావరాలపై మంగళవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. 9 మందిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు దాడి చేసి రూ.5,750 నగదు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో సిబ్బంది కరుణాకర్, ప్రశాంత్, ధనరాజ్, ఫర్హాన్ పాల్గొన్నారు.

**◆ నేడు భూభారతిపై అవగాహన**

సదాశివపేట(సంగారెడ్డి): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం ఉ. 10 గంటలకు పట్టణంలోని దుర్గ ఫంక్షన్ హాల్‌లో కొత్తగా అమల్లోకి వచ్చిన భూభారతిపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సరస్వతి తెలిపారు. సదస్సుకు ప్రజలందరూ హాజరై కావాలని కోరారు.

**◆ నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం**

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని సోలక్‌పల్లి శివానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ నిలిచిపోనుంది. 33/11 సబ్‌స్టేషన్ విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం ఉ. 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జిన్నారం బొంతపల్లి ఏఈలు వెంకటేశ్వర్లు, రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి గృహ వినియోగదారులు, పారిశ్రామికవేత్తలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

**◆ మహిళతో అసభ్య ప్రవర్తన**

సంగారెడ్డి క్రైమ్: జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన ఘటన పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని బైపాస్ మార్గంలో ఈనెల 15న అర్ధరాత్రి తన కుటుంబంతో కలిసి ఇంటికి వెళ్తున్న సమయంలో మార్గమధ్యలో గుర్తు తెలియని కొందరు యువకులు బైకులో వచ్చి మహిళతో అసభ్యంగా ప్రవర్తించి, మహిళతో పాటు తన భర్తపై దాడి చేశారని స్థానికులు పేర్కొన్నారు.

**◆ బాధిత కుటుంబానికి నష్టపరిహారం**

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం పారిశ్రామికవాడలోని ఎంఎస్‌ఎన్ పరిశ్రమలో గత సంవత్సరం శంకర్‌రెడ్డి (32), కార్మికుడు పనిచేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందాడు. దీంతో కార్మికుడి కుటుంబం న్యాయం చేయాలని పరిశ్రమ ప్రతినిధులను సంవత్సర కాలంగా మొరపెట్టుకుంటున్న స్పందించలేదు. బాధిత కుటుంబం స్థానిక బీజేపీ మున్సిపల్ శాఖ అధ్యక్షుడు ఆనంద్ కృష్ణారెడ్డి రవీందర్ రెడ్డిలను ఆశ్రయించగా... పరిశ్రమ యజమాన్యంతో చర్చించి నష్టపరిహారానికి ఒప్పించారు. మృతుడి భార్య సోనియాకు నష్టపరిహారం కింద రూ.15 లక్షలను పరిశ్రమ ప్రతినిధులతో కలిసి నాయకులు అందజేశారు.

**◆ నిరుపేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్**

సంగారెడ్డి : సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు సీహెచ్ రాజశేఖర్ అన్నారు . బుధవారం చౌట్కూర్ మండలం చేక్రియాల్ గ్రామంలో లబ్ధిదారులకు సీఎంఆర్ ఎఫ్ చెక్కులు అందజేశారు. మంత్రి దామోదర సహకారంతో చెక్కులను అందజేసినట్లు తెలిపారు.

**◆ చెక్కు అందజేత**

జహీరాబాద్ టౌన్: మండలంలోని రంజోల్ గ్రామానికి చెందిన రాముకు అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా ఎమ్మెల్యే మాణిక్ రావు రూ.54 వేల మంజూరు చేయించారు. బుధవారం బీఆర్‌ఎస్ నాయకులు నామ రవికిరణ్, సత్యం చెక్కును అందజేశారు.

**◆ జేఎన్టీయూలో '2కే25 ఫెస్ట్'**

సంగారెడ్డి : సుల్తాన్పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో '2కే25 ఫెస్ట్'ను బుధవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ జి.నరసింహ వివిధ విభాగాలకు సంబంధించిన ఇన్నోవేషన్‌ను ప్రారంభించారు. 13వ టెక్నికల్ ఫెస్ట్‌లో భాగంగా కళాశాలలో వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు ఏడాది పాటు చదువుకున్న డిపార్ట్‌మెంట్లకు సంబంధించి ప్రాజెక్టుల రూపంలో తయారు చేసి ప్రదర్శించారు. సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్టుమెంట్లకు సంబంధించి నేడు మరిన్ని ఈవెంట్లు ఉంటాయని, చివరి రోజు సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

**◆ వ్యక్తి అదృశ్యం**

సంగారెడ్డి క్రైమ్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమేష్ కథనం మేరకు.. పుల్‌కల్ మండలం చింతకుంట గ్రామానికి చెందిన నీరుడి సన్నీబాబు (35), పట్టణంలోని శ్రీనగర్‌లో పెయింటర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. కొన్నిరోజులుగా దంపతులు గొడవ పడడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఈనెల 12న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. చుట్టుపక్కల వెతికిన ఆచూకీ లభ్యం కాలేదు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

**◆ పుస్తె మెట్టెలు బహూకరణ**

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం వావిలాల గ్రామానికి చెందిన భాగాని లింగం ఇద్దరు కుమార్తెల వివాహాలకు జిన్నారం మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్ పుస్తెమెట్టెలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆడబిడ్డల పెళ్లిళ్లకు తన సంపూర్ణ సహకారం అందిస్తానని తెలిపారు. పెద్ద మనసు చాటుకున్న మాజీ ఎంపీపీకి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.